క్లుప్తంగా

స్విమ్మర్లకు సత్కారం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి వాసులు ఈత పోటీల్లో పలుమార్లు ప్రతిభ చూపారు. విజయవాడ దుర్గ ఘాట్ వద్ద కృష్ణానదిలో ఆక్వా డెవిల్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1.5 కిల్లో మీటర్ల ఈత పోటీలో షేక్ గని, నిమ్మగడ్డ హనుమంతరావు, కాకుమాను జోజి, పెరుమాళ్ళ శ్రీనివాస్, చంద్రపాటి శ్రీనివాస్, పోతుగంటి నరసింహారావు, కాకర్ల రమేష్, ఆదిరెడ్డి, సాంబశివరావు, రాజేష్ నాయక్, బుజ్జి ప్రతిభ చూపారు. అంతేగాక 68 సంవత్సరాల వయసులో పోతుగంటి నరసింహారావు కృష్ణానదిని ఈదాడు. ఈత పోటీల్లో పాల్గొని కృష్ణానదిని పలుమార్లు దాటి బహుమతులు పొందిన స్విమ్మర్లను మంగళవారం స్విమ్మింగ్ సహచరులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్విమ్మర్లు గద్దె చలమయ్య, డాక్టర్ సుధాకర్ రావు, బగ్గి నరసింహారావు, దివ్వెల శ్రీనివాసరావు, సుబ్బారావు, పాట్ల అంజి, పూర్ణ, ఆకుల హనుమంతరావు, ఏడుకొండలు (ఈ.కే) అన్నా సుమన్, దాసరి తిరుపతి రావు, పాల్ కుమార్, రాజ్ వీర్ ఉన్నారు.

చిలకలూరిపేట ఎంఈఓను వెంటనే నియమించాలి

సత్తెనపల్లి: చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారిని వెంటనే నియమించాలని పీఆర్టీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బంకా వాసుబాబు మంగళవారం కోరారు. ఇటీవల కాలంలో చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న లక్ష్మీ ఏసీబీ వలలో చిక్కి సస్పెండ్ అయిన సంగతి తెలిసిన విషయమేనన్నారు. ఆమె స్థానంలో కొత్తగా ఎంఈఓని నియమించాలన్నారు. చిలకలూరిపేట మండలంలోని ఉపాధ్యాయులు జీతాల కోసం ఇబ్బంది పడకుండా ఉండటానికి వీలుగా కొత్త మండల విద్యాశాఖ అధికారిని నియమించవలసిందిగా కోరారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేత

రాజుపాలెం: మండలంలోని మొక్కపాడు ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం ఆసరా చారిటబుల్ ట్రస్ట్, ఆదరణ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, అత్యాచారాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పిల్లలకు స్టేషనరీని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.ఇంద్రసేన, కె.జాషువా, కొమ్ము రవికుమార్, హెచ్ఎం కొత్తపల్లి రత్తయ్య, గుంటగాని నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు గురైన మహిళా కూలీ

అచ్చంపేట: మిరప తీతలకు వెళ్లిన మహిళా కూలీ పాము కాటుకు గురైన ఘటన మండలంలోని రోకటిగుంటవారిపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సిద్ది లక్ష్మీతిరుపతమ్మ రోజులాగానే మిర్చి తీతలకు కూలి పనికి వెళ్లింది. మిర్చి తీస్తుండగా పాము కాటుకు గురైంది. మెరుగైన వైద్యం కోసం బాధితురాలు లక్ష్మీతిరుపతమ్మను 108 అత్యవసర వాహనంలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

వాహనాల తనిఖీ



క్రోసూరు: సామర్థ్యానికి మించి రవాణా అవుతున్న వాహనాలను ఎస్ఐ నాగేంద్రరావు మంగళవారం తనిఖీ చేసారు. ఈ సందర్భంగా మిర్చి కూలీలతో వెళ్తున్న లారీలను ఆపి డ్రైవర్లను, ప్రయాణికులను కూడా హెచ్చరించారు. కూలీ పనులకు వెళ్లే కూలీలు కిక్కిరిసి వెళ్లే వాహనాలను ఎక్కవద్దన్నారు. అలా వెళ్లటం ద్వారా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రమాదాలలో అధిక శాతం మంది ప్రాణాలు కోల్పోవటం, వైకల్యం చెందటం జరుగుతున్నాయని అన్నారు. అంతే కాక వాహనాల ప్రమాదంలో ఒకరిపై ఒకరు పడటం వలన తొక్కిసలాట జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. కాబట్టి కూలీలు వాహనానికి సరిపడనంత మేరకే ప్రయాణించాలని, వాహన డ్రైవర్లు తమ హెచ్చరికలు పెడచెవిన పెట్టి తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన భక్తాంజనేయ స్వామి వార్షికోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసి ఉన్న భక్తాంజనేయస్వామి దేవస్థానంలో 25వ వార్షిక వేడుకలు రెండు రోజులుగా ఘనంగా జరిగాయి. చివరి రోజు భక్తాంజనేయ స్వామి దేవస్థానం నిర్మించి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా భక్తులు అందరూ పాల్గొని పెద్ద ఎత్తున ఆలయ అర్చకులు శ్రీమాన్ వేదాంతం విజయ నరసింహాచార్యులు దంపతులకు మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఘటకాల వెంకట స్వరాజ్యలక్ష్మి, పులహరి సర్పుజీ, గోవిందరావు, భవాని ప్రసాదు, భానుజీ, ఫిరోజీ, శివాజీ, సుకన్య, కల్పన, అంజలి, రాజేశ్వరి, నాగ నీరజ, వెంకటేశ్వర్లు, ప్రసాదు, చిన్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

18 పంచాయతీలు .. 11 మంది వీఆర్వోలు



క్రోసూరు తహసీల్దార్ కార్యాలయం

గ్రామం	వీఆర్వో	ఫోన్ నంబర్
క్రోసూరు-1,అనంతవరం	లేళ్ల బ్రహ్మానాయుడు	9398104374
క్రోసూరు-2	పి.ప్రభుదాసు	6281759684
క్రోసూరు-3	షేక్ దావూద్ ఇబ్రహీం	9603443600
దొడ్లేరు-1,పెరికపాడు, ఆవులవారిపాలెం	షేక్ సైదులు	6303211235
బయ్యవరం	ఎన్.క్రిష్టారావు	7780764498
దొడ్లేరు-2	ఎం.రాము	918254587
పీసపాడు, పారుపల్లి	ఎ.రామచంద్రరావు	9014371462
ఊటుకూరు, విప్పర్ల, గరికపాడు, గుడిపాడు, గాదెవారిపాలెం	షేక్ మస్తాన్‌వలి	9701115730
88 త్యాళ్లూరు, ఉయ్యందన	ఎం.రాజకుమార్	9705973108
అందుకూరు, నాగవరం, బాలెమర్రు	ఎస్.చిన్న కోటయ్య	9963160878
హసనాబాద్	సీహెచ్ పేరయ్య	9866109736

- మండలంలో 18 పంచాయతీలు, మూడు అనుబంధ గ్రామాలు
- వీఆర్వోల కొరత, ఇన్‌చార్జిలతో సరిపెడుతున్న ప్రభుత్వం
- అర్జీలు పెండింగ్ లేకుండా చూస్తున్నట్లు చెబుతున్న తహసీల్దార్

క్రోసూరు: మండలంలోని రెవెన్యూ శాఖలో విలేజి రెవెన్యూ అధికారుల (వీఆర్వోల) కొరత ఉంది. ఉన్న వీఆర్వోల్లోనే కొంత మంది అదనపు గ్రామాల ఇన్‌చార్జిల బాధ్యతలు చూసుకోవాల్సి వస్తుంది. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జనాభా ప్రాతిపదికన గ్రామ సచివాలయాలు ఏర్పడినప్పటికీ మండలంలో 18 గ్రామ పంచాయతీలు, మూడు అనుబంధ గ్రామాలున్నాయి. వీటిని బట్టి 18 గ్రామ పంచాయతీలకు వీఆర్వోలు కావాల్సి ఉంది. మిగతా మూడు అనుబంధ గ్రామాలకు ప్రధాన పంచాయతీ వీఆర్వోలే విధులు నిర్వహిస్తారు. క్రోసూరు మండలంలో 18 పంచాయతీలు, మూడు అనుబంధ గ్రామాలకు 15 గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయటం జరిగింది. అయితే వీటికి సంబంధించి 11 మంది వీఆర్వోలు మాత్రమే పనిచేస్తున్నారు. అంటే 18 పంచాయతీలకు 11 మంది వీఆర్వోలు పనిచేస్తున్నారు. 11 మంది వీఆర్వోల్లో కొంత మంది తమ హెడ్‌క్వార్టర్‌తో పాటు మిగతా గ్రామాలకు ఇన్‌చార్జిలుగా పని చేస్తున్నారు. దీంతో వారిపై అదనపు పని భారం పడుతుంది. క్రోసూరు మండలంలో పని చేస్తున్న వీఆర్వోలు, ఫోను నంబర్లు ఈ విధంగా ఉన్నాయి.

నేను ఐదు గ్రామాలకు వీఆర్వో



నాకు ఐదు గ్రామాల బాధ్యత ఉంది. సుమారు 10 కి.మీ. దూరంలో ఊటుకూరు, విప్పర్ల, గాదెవారిపాలెం, గుడిపాడు, గరికపాడు గ్రామాలకు వీఆర్వోగా పనిచేస్తున్నాను. కష్టంగా ఉంటుంది. కానీ తప్పదు. పని ఉన్న గ్రామం వారు ఫోను చేస్తే నేను అక్కడికి ఎప్పుడు వచ్చేది చెబుతాను. ఆ సమయంలో అక్కడ అందుబాటులో ఉండి వారి అర్జీలు తీసుకుంటాను.

– షేక్ మస్తాన్‌వలి వీఆర్వో, ఊటుకూరు

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి



ప్రతి పంచాయతీకి వీఆర్వో ఉండాలి. ఇన్‌చార్జిల కాలం పోయింది. ప్రజలకు అందుబాటులో ఉంటేనే సమయానికి పనులు పూర్తి చేయించుకుని ఎవరి పనులు వారు చూసుకుంటారు. గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, విద్యార్థుల ఉన్నత చదువులు, రైతుల పంట రుణాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు లాంటి ప్రతి పనిలో వీఆర్వో అవసరం ఉంటుంది. కాబట్టి ఏ గ్రామానికి ఆ గ్రామంలో వీఆర్వో ఉండాలి, సిటిజన్ చార్ట్ ప్రకారం పెండింగ్ లేకుండా పనులు పూర్తి చేయాలి.

– పట్టీల శ్రీనివాసరావు, అనంతవరం

రెవెన్యూ సదస్సులకు 187 అర్జీలు



వీఆర్వోల కొరత ఉన్నప్పటికీ సమస్యలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు సార్ట్‌అవుట్ చేస్తున్నాను. గత డిసెంబర్ నెలలో జరిగిన రెవెన్యూ సదస్సులకు 187 అర్జీలు రాగా అందులో 36 అర్జీలు పరిష్కరించటం జరిగింది. 151 అర్జీలు మాత్రమే పెండింగ్ ఉన్నాయి. అర్జీలన్నీ క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరిస్తున్నాను.

– వీవీ నాగరాజు, తహసీల్దార్, క్రోసూరు

పొగతో విద్యార్థుల అవస్థలు

పెదకూరపాడు : మండల పరిధిలోని 75 త్యాళ్లూరు జెడ్పీ హైస్కూల్ తరగతి గదులు గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే పొగతో నిండిపోయి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు దక్షిణం వైపు డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేశారు. దీని నుంచి వచ్చే పొగ గాలి వాటంతో పాఠశాల వైపు వెళ్లడంతో తరగతి గదుల్లో పొగ నిండిపోతుంది. ఫ్యాన్లు తిరుగుతుంటే మరికొంత పొగను తరగతి గదుల్లోకి లాగేస్తుంది. వేసవి కాలం ప్రారంభం కావడంతో ఉక్కపోతగా ఉంటుండటంతో ఫ్యాన్లు వేయక తప్పడం లేదు. గతంలోనూ పలు మార్లు గ్రామ పంచాయతీ పెద్దల దృష్టికి సమస్యను తీసుకెళ్లడం జరిగిందని పలువురు తెలిపారు. గ్రామ సర్పంచ్‌కు స్వయంగా విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు. పదో తరగతి కామన్ పరీక్షలు కూడా ఈ పాఠశాలలో జరుగనున్నాయి.



పాఠశాల సమీపంలో డంపింగ్ యార్డు వద్ద వస్తున్న పొగ

చెత్త నుంచి సంపద సృష్టిస్తామని చెబుతున్న ప్రభుత్వ లక్ష్యం ఒక వైపు కాగా, స్థానికంగా చెత్త నుంచి పొగ సృష్టించడం పాఠశాల విద్యార్థులకు అనారోగ్యం కలిగిస్తుంది. సమస్య పరిష్కరించకుంటే డంపింగ్ యార్డ్ తరించాలని లేని పక్షంలో ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని పూర్వ విద్యార్థి సంఘ సభ్యులు పేర్కొన్నారు.

కర్లపూడిలో పొలం పిలుస్తోంది

అమరావతి: మండల పరిధిలోని కర్లపూడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ క్రోసూరు సహాయ సంచాలకుడు వి.హనుమంతరావు రైతులతో మాట్లాడుతూ రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపట్టిందన్నారు. గత వారం రోజులుగా 3,789 మంది రైతులకు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయడం జరిగిందన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు వల్ల రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాల ప్రయోజనాలు నేరుగా పొందవచ్చన్నారు. రైతులందరూ కచ్చితంగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ క్రోసూరు సహాయ సంచాలకుడు హనుమంతరావు

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ఏవో వెంకటేశ్వర్లు



అచ్చంపేట: వ్యవసాయ శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందాలంటే భూములు కలిగిన రైతులంతా తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాల్సి ఉంటుందని ఏవో పి.వెంకటేశ్వర్లు తెలిపారు. చిగురుపాడు, అంబడిపూడి గ్రామాలలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. దీని ఆవశ్యకతను రైతులకు వివరించారు. విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందేందుకు రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయిన ఫోను నంబరుతో రైతు సేవా కేంద్రాలలో నమోదు చేయించుకోవాలన్నారు. ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే రాయితీలు పొందేందుకు, సీసీ కేంద్రాలలో పంటలు అమ్ముకునేందుకు ఆన్‌లైన్‌లో రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకుని ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఆనంద్ బాబు



కొలిమి షమ్మీ

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.ఆనంద్‌బాబును నియమిస్తూ జీఓ ఆర్టీ నెంబర్ 116 ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ నుంచి మంగళవారం రాత్రి వెలువడింది. ఇప్పటి వరకు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కొలిమి షమ్మీ ఇటీవల గ్రేడ్-2 కమిషనర్‌గా పదోన్నతి పొందడంతో ఆయనను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ జీవో ఆర్టీ నెంబర్ 117 వెలువడింది. గుంటూరు నగరపాలక సంస్థలో శానిటరీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ బాబు పదోన్నతి పొంది సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా రానున్నారు. బదిలీపై వెళ్తున్న కొలిమి షమ్మీ కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఏడాగా పని చేస్తూ పదోన్నతిపై సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా 2021 డిసెంబర్ 29న వచ్చారు. పట్టణ ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు ఆయన కృషి చేశారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

జిల్లా దేవదాయ శాఖ అధికారి



రాజుపాలెం: దేవరంపాడు కొండపై ఐదు శనివారాలు జరిగే తిరునాళ్లను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా దేవదాయ శాఖ అధికారి అచ్యుత్ తెలిపారు. మండలంలోని దేవరంపాడు కొండపై మత్స్య రూపంలో వెలసిన వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈవో సురేష్‌ను తిరునాళ్ల ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఈవోకు సూచించారు. అధిక సిబ్బందిని తెప్పించుకోవాలని, బందోబస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని తెలిపారు.ఈవో సురేష్, సిబ్బంది ఉన్నారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి



తొండపి(ముప్పాళ్ళ): రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని, రైతు గుర్తింపు సంఖ్య కొరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. మండలంలోని తొండపి, రుద్రవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, డాట్ సెంటర్ సైంటిస్ట్ డా.నగేష్, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారిలు పాల్గొని మొక్కజొన్న, వరి, మిరప పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. రసాయన మందులు, నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, వేప ఉత్పత్తులను వాడాలని సూచించారు. వరి మాగాణుల్లో అపరాలు, జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట పైర్లను పెంచి కలియదున్నటం వలన భూసారం పెరుగుతుందన్నారు. ఏఈఓ అరుణ, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో ఉండే లక్ష్మణరావును గెలిపించండి

అమరావతి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నిస్వార్థ ప్రజాసేవకుడు కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు వి.కృష్ణయ్య కోరారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించిన అనంతరం ఆయన సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతూ మేధావి, విద్యావంతుడు, ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, కర్షక, నిరుద్యోగ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే లక్ష్మణరావును గెలిపించటం పట్టభద్రుల బాధ్యత అన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను మరచి విద్యుత్ చార్జీలు పెంచి, స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి పేదలను మోసం చేసిందన్నారు. అలాగే వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసి కాలువల నిర్వాహణ ప్రైవేటు పరం చేసి రైతుల నెత్తిన భారం వేస్తుందన్నారు. అధికారంలోకి రాగానే జనవరి నెలలో నిరుద్యోగులకు డిఎస్‌సి ప్రకటిస్తామన్న హామీ మార్చి నెల వస్తున్నా నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు గద్దె చలమయ్య మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా ఖజానా ఖాళీగా ఉందని చెప్పి తప్పించుకుంటున్నారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయాలను చొప్పించి పెద్దల సభకు విలువ లేకుండా చేశారన్నారు. అందరి సమస్యలు తనివిగా భావించి, అందరికి అందుబాటులో ఉండే లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రవిబాబు, సూరిబాబు, మొహిద్దీన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు వి.కృష్ణయ్య

నేటి నుంచి వడ్డవల్లి పోలేరమ్మ తల్లి వార్షికోత్సవాలు

సత్తెనపల్లి: పట్టణంలోని వడవల్లిలో వేంచేసి ఉన్న పోలేరమ్మ తల్లి 17వ వార్షికోత్సవాలు ఈ నెల 19 నుంచి 21 వరకు మూడు రోజులపాటు జరగనున్నాయని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మహాశక్తి స్వరూపిణి గ్రామ దేవత వడ్డవల్లి పోలేరమ్మ తల్లి దేవాలయంలో ఈ నెల 19న తెల్లవారుజామున 4 గంటల నుంచి మంగళవాయిద్య సహిత తోరణ, సుప్రభాత సేవ, గణపతి పూజ, బ్రహ్మ కలశారాధన, పంచామృత సహిత ఏకాదశ ద్రవ్యాలతో పోలేరమ్మ తల్లికి, దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహించనున్నారు. 11 గంటల నుంచి దివ్య అలంకరణ అనంతరం దివ్య దర్శనం, శ్రీచక్ర సహిత దుర్గా సహిత శ్రీసూక్త సమేతంగా అమ్మవార్లకు దివ్య కుంకుమ పూజ, సహస్ర నామ పుష్పార్చన, గాజుల అలంకార సేవ, విశేష పూజా కార్యక్రమాలు, ధూప దీప నైవేద్య సహిత తీర్థ ప్రసాద వినియోగం చేపట్టనున్నారు. సాయంత్రం భజన సంకీర్తనలు, లలితా సహస్ర నామ పారాయణం, దీపోత్సవం చేపడుతారు. ఈ నెల 20న అమ్మవార్లకు మొక్కుబడులు, ముడుపులు చెల్లించుట, విశేష కుంకుమ పూజలు, భజన సంకీర్తనలు నిర్వహిస్తారు. 21న ధనలక్ష్మి అలంకరణ, అమ్మవార్లకు పొంగళ్లు (11 రకాల మహా నైవేద్యాలు) సమర్పించడం, లక్ష్మీ పూజ, ముత్తైదువులచే (మంగళ గౌరీ పూజ) కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. దేవస్థాన పురోహితులు బ్రహ్మశ్రీ గూడవల్లి అనీల్ కుమార్ శర్మ, కొమ్మూరి వెంకట రమేష్ శర్మల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

అధికార బలంతో ప్రజల గొంతు నొక్కుతున్న కూటమి ప్రభుత్వం

రాజుపాలెం: మండలంలోని ఉప్పలపాడు పంచాయతీ శివారు లక్ష్మీపురంతండాకు చెందిన రైతు బాణావతు బుల్లానాయక్ మీడియా ముందు నాకు ఇంతవరకు రైతు భరోసా లేదు, నా కూతురికి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ రాక ప్రస్తుతం ఇంటిలోనే ఉంది. గత ఏడాది జగన్ ప్రభుత్వంలో కల్లాల్లో ధాన్యాన్ని బస్తా రూ.2200కు కొన్నారు, ఈ ప్రభుత్వంలో బస్తా రూ.1300కు అమ్మాను. అదే విధంగా మిర్చి జగన్ ప్రభుత్వంలో క్వింటా రూ.22 వేలకు అమ్మాను, ఈ ప్రభుత్వంలో రూ.10 వేలకు కూడా కొనే దిక్కులేదు, పత్తి గత ఏడాది రూ.8 వేలు, రూ.9 వేలు అమ్మింది, ఇప్పుడు రూ.4 వేలకు కూడా కొనే దిక్కులేదని, పండించిన పంటలకు గిట్టుబాటు లేదని, రైతులు కోలుకునేందుకు పదేళ్లు పడుతుందని తన బాధను వెల్లబుచ్చి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించినందుకు గత మూడు రోజులుగా పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పుతూ మంగళవారం అరెస్టు చేశారు. ఈ అరెస్టు టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే జరిగినట్లు గ్రామస్తులు, బంధువులు ఆరోపిస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను అధికార బలంతో, టీడీపీ నాయకుల అత్యుత్సాహంతో హరించి వేస్తున్నారన్నారు. ప్రభుత్వ జులుంతో అభిప్రాయాలను తడదైన శైలిలో వెల్లబుచ్చిన బుల్లానాయక్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకెళ్లారు. దీనిని ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండిస్తున్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

అచ్చంపేట: విద్యార్థులు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, ప్రాథమిక స్థాయి నుంచే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జర్మనీ దేశస్తురాలు బార్బోరా అన్నారు. మండలంలోని తాళ్లచెరువు సెంట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం, సైన్స్ ఎక్స్‌పోలో ఆమె పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులకు విజ్ఞాన, వినోదాత్మక విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఐఐటీ ఒలంపియాడ్‌లో 2, 3 ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులు చేపట్టిన సృజనాత్మక ప్రాజెక్టులను, సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. సిరిపురం చర్చి విచారణ గురువులు ఫాదర్ తోమాస్, తల్లిదండ్రులు, హెచ్ఎం మేరి వినయ, సిస్టర్ హెజ్బెల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు పొందిన విద్యార్థులతో జర్మనీ దేశస్తురాలు బార్బోరా, ఉపాధ్యాయులు

అభ్యసనా లోపాన్ని పరిష్కరించడమే సాల్ట్ లక్ష్యం

- మండల విద్యాశాఖాధికారి-2 రాఘవేంద్రరావు
- అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభం

సత్తెనపల్లి: ప్రస్తుతం ఉన్న అభ్యాసనా లోపాన్ని పరిష్కరించడమే సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రధాన లక్ష్యమని సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి-2 ఏ రాఘవేంద్రరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు జరగనున్న జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి సిద్ధం చేయడం ద్వారా పునాది అభ్యాసనా నాణ్యతను బలోపేతం చేయడం, దానిని కొనసాగించడం, అన్ని గ్రేడులలో కార్యకర్తలు విద్యార్థుల మధ్య పరస్పర సంబంధాల నాణ్యతను మెరుగుపరచడం ద్వారా ప్రాథమిక ఫలితాలను నిలుపుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి, పాఠశాల స్థాయిలో చేసే అంచనాల ఆధారంగా పిల్లల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందించడానికి అవసరమైన బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కార్యకర్తలకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారా ఆశించిన ఫలితాలు సాధించవచ్చన్నారు. శిక్షణలో సీడీపీఓ టీ శ్రీలత, ఉపాధ్యాయులు షేక్ ఆఫీజ్, భాస్కరరావు, సాయిబాబా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.ప్రమీల, ఆశ, అనంతలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానజ్యోతి శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు

చిన్నారులకు ఆటపాటలతో బోధన అందించాలి

రాజుపాలెం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో బోధన చేయాలని మండల విద్యాశాఖాధికారి కేవీఎల్ నరసింహారావు తెలిపారు. మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా భాష, గణితంకు సంబంధించిన బోధన పద్ధతులపై శిక్షణ తరగతులు మంగళవారం జరిగాయి. ఈ శిక్షణలో ఎంఈవో మాట్లాడుతూ కేంద్రాలలో పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. చిన్నారులకు సమపాళ్లలో పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లుగా నాగ రామారావు, బ్రహ్మారెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం భూలక్ష్మీ, సూపర్‌వైజర్లు ప్రసూన, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో నరసింహారావు

రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు



నకరికల్లు: రోడ్డు ప్రమాదాలు తరచూ జరిగే ప్రాంతాలను గుర్తించి అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.వి.సుబ్బారావు సూచించారు. మండలం పరిధిలో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు పోలీస్, రవాణా శాఖ అధికారులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ పోలీస్, రవాణా శాఖ, రోడ్డు భద్రత సిబ్బంది, ఎన్ఏఎం అధికారులతో యాక్సిడెంట్ స్పాట్‌లు గుర్తించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ చల్లా సురేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివనాగేశ్వరరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మనీషా, ఎన్ఏఎం ప్రాజెక్టు అధికారులు శ్రీకాంత్, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.